
సాక్షి
అనకాపల్లి
సోమవారం : 3 : జూన్ : 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
32.3/27.0

వాతావరణం

ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి ఆదివారం తెలిపారు.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రారంభం

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి సారిగా ఆన్‌లైన్‌లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ప్రారంభమైందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.సుజాత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు తెలుగు, ఇంగ్లిష్, హిందీ పేపర్లను దిద్దారని చెప్పారు. ప్రతి పేపరును రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న జూనియర్, సీనియర్ అధ్యాపకులతో రెండుసార్లు మూల్యాంకనం చేయిస్తున్నామని పేర్కొన్నారు.

నేటి పాలిసెట్ కౌన్సెలింగ్ 6వ తేదీకి మార్పు



పాలిసెట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

తుమ్మపాల: మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ 7వ రోజు ఆదివారం కూడా కొనసాగింది. 92,001 నుంచి 1,08,000 ర్యాంక్ మధ్య గల 91 మంది విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఐసీఆర్ పత్రాలు పొందారని కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో బాలురు 65 మంది, బాలికలు 26 మంది ఉన్నారన్నారు. 1,08,001నుంచి ఆఖరి ర్యాంకు వరకు సోమవారం జరగనున్న కౌన్సెలింగ్ ప్రక్రియ సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఈనెల 6వ తేదీకి మార్పు చేసినట్టు చెప్పారు. వెబ్ ఆప్షన్లు ఈనెల 7 నుంచి 10 వరకు పెట్టుకోవచ్చని, మార్పులకు 11న అవకాశం ఉందన్నారు. 13న సీట్ల అలాట్‌మెంట్ జరుగుతుందని, 14 నుంచి 19వ తేదీ వరకు జాయినింగ్ రిపోర్టు సమర్పించి తరగతుల్లో చేరవచ్చన్నారు.

30 వసంతాల వేడుక



చదువుచెప్పిన ఉపాధ్యాయులతో 1992-93 బ్యాచ్ విద్యార్థులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ విద్యార్థుల కలయిక ఆదివారం అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణమండపంలో జరిగింది. పదోతరగతి పూర్తిచేసి 30 ఏళ్లు దాటడంతో 30 వసంతాల వేడుకని వైభవంగా నిర్వహించారు. ఆబ్యాచ్‌కు చెందిన 50 మంది విద్యార్థులు ఈకలయికలో పాల్గొని తమకి చదువుచెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా ఆటపాటల్లో మునిగితేలారు. పిల్లలకు పలు ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు సత్యవతి, నాగరాజకుమారి, సుజాత, చందన, బోర ప్రసాద్‌రెడ్డి, దామోదరరెడ్డి, పి.గోపాల్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'దర్శిని' బృందానికి అభినందనలు



సినిమా బృందాన్ని సత్కరిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట (విశాఖ): ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం దర్శిని సినిమా బృందం అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, రంగసాయి మీడియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దర్శకులు, నటీనటులను ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర యువ దర్శకుడు, నటులు ఇక్కడ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నిర్మించిన చిత్రం దర్శిని అని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల విడుదలై ఆదరణ పొందుతోందన్నారు. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని, ప్రభుత్వాలు చొరవ తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. చిన్న చిన్న సినిమాలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం దర్శకుడు డాక్టర్ ప్రదీప్ అల్లు, నిర్మాత ఎల్.వి.సూర్యం, సహాయ దర్శకుడు కె.సంతోష్, నటులు ఎస్.వి.సత్యప్రసాద్, నవీన్, సౌండ్ ఇన్‌చార్జి వేదరాము, సిద్ధార్థలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దర్శిని చిత్రాన్ని ప్రదర్శించి, నటీ నటులతో ముఖాముఖి నిర్వహించారు. రంగసాయి మీడియా ప్రతినిధి బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు, హేమ, జమ్మా చిన్నబాబు, సొసైటీ ప్రతినిధులు బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, ఉషారాణి, ప్రభు పాల్గొన్నారు.

ఆంక్షలు కట్టుదిట్టం

- మహా దుర్భేద్యంగా కౌంటింగ్ కేంద్రం
- చుట్టూ బారికేడ్ల ఏర్పాటు
- సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు మాత్రమే అనుమతి
- రెడ్‌జోన్ పరిధిలో పోలీసుల పహారా
- రేపటి లెక్కింపునకు పటిష్ట చర్యలు



కౌంటింగ్ కేంద్రం వద్ద వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు ఇంకా ఒక్క రోజే మిగిలి ఉండడంతో ఆంక్షలను కట్టుదిట్టం చేశారు. మంగళవారం జరగనున్న కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. శంకరం గ్రామంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను తప్ప ఇతరులెవ్వరినీ లోనికి అనుమతించరు. పరిసరాల్లో కూడా ఎవరూ ఉండకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ నిశితంగా చెక్ చేయనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లను అనుమతించరు. మీడియాకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్రామాలకు వెళ్లాలని వాహనదారులకు సూచిస్తున్నారు. లెక్కింపులో ఏ చిన్న పొరపాటు తలెత్తకుండా శిక్షణ ఇచ్చారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే సరిచేయడానికి భెల్ ఇంజినీర్లను అందుబాటులో ఉంచుతున్నారు. నిమిషాల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. కేవలం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల సిబ్బంది మాత్రమే పోలీసుల అనుమతితో రాకపోకలు చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి కౌంటింగ్ కేంద్రం వరకు ప్రతి 100 అడుగులకు ఒక పోలీసు కానిస్టేబుల్‌ను నియమించారు. కౌంటింగ్ రోజున వచ్చే వాహనాలకు కలెక్టరేట్ సమీపంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి బారికేడ్లు అమర్చారు. షార్ట్‌కట్ దారులను మూసి వేసి కేవలం రహదారిపై మాత్రమే రాకపోకలను అనుమతిస్తున్నారు.

పాస్‌లు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. కౌంటింగ్ కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన రహదారితో పాటు రేబాక నుంచి గొలగాం మీదుగా కల్పనా లేఅవుట్ రహదారి, జాతీయ రహదారి నుంచి రాయుడుపేట మీదుగా బట్లపూడి రహదారిపై కూడా పోలీసుల బందోబస్తు ఏర్పాటుచేశారు. అటుగా వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద, రోడ్లకు ఇరువైపులా చిన్న చిన్న రాళ్లు కూడా లేకుండా కూలీలను పెట్టి రాళ్లను ఏరి ట్రాక్టర్లతో బయటకు డంప్ చేస్తున్నారు. రెడ్ జోన్ పరిధి గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆదివారం ఉదయం డప్పుతో దండోరా వేయించారు. ఇద్దరు కన్నా ఎక్కువ మంది జనం గుమికూడి ఉండటానికి వీల్లేదని, సభలు, సమావేశాలు పెట్టవద్దని తెలియజేశారు. రెడ్ జోన్ పరిధిలో డ్రోన్లు, గాలిపటాలు, బెలూన్లు ఎగరవేయకూడదని ప్రజలకు తెలియజేశారు.



పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్థలం



కౌంటింగ్ కేంద్రం సమీపంలో రాళ్లను ఏరి ట్రాక్టర్‌పై తరలిస్తున్న కూలీలు



రెడ్‌జోన్ పరిధి గ్రామాల్లో జాగ్రత్తలపై దండోరా

పోస్టల్ బ్యాలెట్ మాక్ కౌంటింగ్

పొరపాట్లకు తావు లేకుండా కలెక్టర్ చర్యలు

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ వంటి అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చెప్పారు. ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై పలు సందేహాలకు సమాధానాలను తెలియజేశామన్నారు.

ఎస్పీ పర్యవేక్షణ



రేబాక జంక్షన్‌లో ట్రాఫిక్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల (రెడ్ జోన్) పరిధిలో బందోబస్తు విధులు నిర్వహించే ప్రతి పాయింట్‌ని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఎన్నికల ఫలితాల రోజు అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది రాకపోకల రూట్‌మ్యాప్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌ను ఏ విధంగా రెగ్యులేట్ చేసుకోవాలి, అనుమతి లేని ప్రజలు గుమికూడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పాయింట్ బ్రీఫింగ్ చేశారు. అంతకుముందు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులతోపాటు కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ)లు సిద్ధంగా ఉంటాయని, ఎలాంటి ఘటన జరిగినట్టు సమాచారం వచ్చినా వెంటనే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, సత్యనారాయణ, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, సతీష్, ఎస్సైలు పాల్గొన్నారు.

50 వేల గాజులతో నూకాంబికకు అలంకరణ

దర్శనానికి పోటెత్తిన భక్తులు



గాజుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారికి ఆదివారం వైశాఖమాసం ఏకాదశి రేవతి నక్షత్రం సందర్భంగా 50వేల గాజులతో అలంకరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పిల్లా పాపలతో అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ పరిధిలో కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూకాంప్లెక్స్‌లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులుతీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల జోష్



నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు ఉత్సాహంగా గడిపారు. ఇటీవల కురిసిన వర్షానికి ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడేందుకు పలువురు పోటీ పడ్డారు. సెలవులు కావడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు ఇక్కడకు వచ్చారు. చుట్టూ ఉన్న ప్రకృతి దృశ్యాలను చూసి పరవశించిపోయారు. కొంతమంది అక్కడే వంటలు చేసుకుని సంహపంక్తి భోజనాలు చేసి ఉత్సాహంగా గడిపారు.

రెడ్ జోన్‌లోనూ అక్రమంగా మద్యం అమ్మకాలు

క్వార్టర్ బాటిల్‌కు రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు

తుమ్మపాల: ఒకవైపు సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అతి సమీపంలో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రానికి చుట్టు పక్కల రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ అమలు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి తూట్లు పొడుస్తూ శంకరం, రేబాక, గురజాడ నగర్, బట్లపూడి, గొలగాం, రాయుడుపేట గ్రామాల్లో యథేచ్ఛగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని శంకరం, రేబాక జంక్షన్లలో అన్ని షాపులూ అక్రమ మద్యానికి కేరాఫ్‌గా మారాయి. ఈ నెల 3, 4, 5 తేదీల్లో ప్రభుత్వం మద్యం అమ్మకాలు నిలిపివేసింది. ఇదే అవకాశం చేసుకుని ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.50 నుంచి రూ.80 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడకు సమీపంలోని అబ్కారీ శాఖ మద్యం గొడౌన్‌లో కళాసీల ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని అక్రమ మార్గంలో తరలించి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం మూడు బాటిళ్ల కన్నా ఎక్కువ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మద్యాన్ని కల్తీ చేస్తూ గొలుసుకట్టు విధానంలో అమ్ముతున్నారు. వీటిపై చూడకుండా కొందరి పోలీసులకు నెలవారీ మామూళ్లు సమర్పించి మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పెంచిన చేతులతో తలకొరివి

తనయుడి మృతితో తల్లడిల్లిన తల్లి



కొడుకు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న తల్లి సత్యవేణి

నర్సీపట్నం: భర్త మరణాన్ని మరవకముందే ఆమెకు పుత్రశోకం వెంటాడింది. రోడ్డు ప్రమాదంలో కొడుకు దుర్మరణంతో పుట్టెడు దుఃఖంలోనూ ఆ తల్లి తల కొరివి పెట్టింది. ఈ విషాద సంఘటన మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 11వ వార్డులో ఆదివారం చోటు చేసుకుంది. పెంటకోట సత్యవేణి కుమారుడు సాయి(23) ఐటీఐ వరకు చదువుకుని హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణను చూసుకునే ఆమె భర్త మాజీ ఎంపీటీసీ రాజు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అతని లేని లోటును కొడుకులో చూసుకుంటూ తల్లి సత్యవేణి అల్లారుముద్దుగా పెంచుకుంటోంది. చేతికి అందివచ్చాడునుకున్న సమయంలో బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి సాయి మృతి చెందాడు. ఈ మరణ వార్త విన్న వార్డు ప్రజలంతా మృతదేహాన్ని కడసారి చూసేందుకు తరలివచ్చారు. కుటుంబానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన కుమారుడు మరణించడంతో ఆ తల్లి కన్నీటి పర్యంతమైంది. కట్టుకున్న భర్త, కొడుకు దూరమవడంతో పుట్టెడు దుఃఖంతో అల్లాడిపోయింది. అన్నీ తానై తలకొరివి పెట్టిన సంఘటన పలువురిని కలచివేసింది.

సెల్ఫీ తెచ్చిన విషాదం

- తంతడి తీరంలో నీట మునిగి ఇద్దరు అక్కా చెల్లెళ్లు మృతి
- గాయాలతో బయటపడ్డ మరో మహిళ



కనకదుర్గ (ఫైల్)



నూకరత్నం (ఫైల్)



తంతడి తీరం

అచ్యుతాపురం: సముద్ర తీరానికి వెళ్లి సేద తీరుదామనుకున్న ఇద్దరు అక్కా చెల్లెళ్లు అందని లోకాలకు వెళ్లిపోయారు. అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు అందించిన సమాచారం మేరకు వివరాలు.. మాకవరపాలెం మండలం శెట్టిపాలేనికి చెందిన యండపల్లి రాంబాబుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఎస్.కనకదుర్గకు వివాహం కాగా భర్తతో కశింకోట మండలం తీడ గ్రామంలో నివసిస్తోంది. చిన్న కుమార్తె వై.నూకరత్నం బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తోంది. వీరిద్దరూ స్నేహితురాలు ద్వారంపూడి శిరీషతో కలిసి తంతడి తీరానికి ఆదివారం వెళ్లారు. తీరంలో రెండు కొండల వద్ద రాళ్లను ఆనుకొని సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నిస్తూ ముగ్గురూ సముద్రంలో పడిపోయారు. ఈ ఘటనలో రాంబాబు కుమార్తెలు కనకదుర్గ (27), వై.నూకరత్నం (21) మృతి చెందారు. వీరి స్నేహితురాలైన యలమంచిలి మండలం గొల్లలపాలేనికి చెందిన ద్వారంపూడి శిరీషను స్థానిక మత్స్యకారులు రక్షించడంతో ఆమెను చికిత్స నిమిత్తం అనకాపల్లి ఉషాప్రైమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు.

చీకటి మాటున కాటేసిన మృత్యువు

- రాత్రి వేళ అదుపు తప్పిన బైక్
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరణంలోనూ వీడని స్నేహం



దామరౌతు ఈశ్వరరావు (ఫైల్)



తూరిబిల్లి భాస్కరరావు (ఫైల్)

కశింకోట: మండలంలో విసన్నపేట గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సీఐ ఎం.వినోద్‌బాబు ఆదివారం అందించిన వివరాలు... పడమటమ్మ వారి లోవ వైపు నుంచి విసన్నపేట గ్రామానికి వస్తున్న బైక్ మార్గమధ్యంలో మలుపులో మదుం వద్ద అదుపు తప్పి పక్కనున్న గెడ్డలోకి దూసుకుపోయింది. దీంతో బైక్ నడుపుతున్న దామరౌతు ఈశ్వరరావు (32), వెనుక కూర్చున్న తూరిబిల్లి భాస్కరరావు (33) గెడ్డలో రాళ్లపై పడిపోయారు. బైక్ కూడా వారి మీద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన వారు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు తెలియజేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికి తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈశ్వరరావు, భాస్కరరావు కలిసి మెలసి స్నేహంగా తిరుగుతుండేవారు. బహిర్భూమికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

శోకసంద్రంలో..

మృతుడు ఈశ్వరరావు బయ్యవరం వద్ద ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈశ్వరరావు భార్య రమ్య గర్భిణి. కుటుంబానికి జీవనాధారమైన ఈశ్వరరావు మృతితో ఇక తమకు దిక్కు ఎవరంటూ ఆమె రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. భాస్కరరావు వ్యవసాయం చేస్తూ తల్లి నాగమణికి చేదోడుగా ఉంటున్నాడు. ఇంకా వివాహం కాలేదు.



సంఘటన స్థలంలో మృతదేహాలు

ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో ఇక తనకు తోడు ఎవరంటూ నాగమణి రోదిస్తున్నారు.సంఘటన జరిగిన ప్రాంతంలో వీధి లైట్లు లేవు. ఈ ప్రాంతమంతా చీకటిగా ఉండడంతో పాటు మదుం వద్ద రక్షణ గోడ లేకపోవడం ప్రమాదానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. ఈశ్వరరావు భార్య రమ్య ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

బీబీఏలో శ్యామలకు జిల్లా ప్రథమ ర్యాంకు



కశింకోట: కశింకోటకు చెందిన కలగా శ్యామల బీబీఏ (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) మూడేళ్ల కోర్సులో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఆమె అనకాపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివారు. ప్రథమ ర్యాంకు సాధించిన శ్యామలను ఉపాధ్యాయులు, స్థానికులు పలువురు అభినందించారు.

లారీ ఢీకొట్టి యువకుడి మృతి

తీవ్రంగా గాయపడిన బాలుడు



మృతి చెందిన వీరబాబు(ఫైల్)

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని కృష్ణాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. క్లింపూడికి చెందిన కె.వీరబాబు(28), తన అన్న కొడుకు మదన్‌కుమార్(4)తో కలిసి ద్విచక్ర వాహనంపై బలిఘట్టం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో వీరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ బాలుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సహజసిద్ధ అందాలకు నిలయం లంబసింగి



ధ్యాన శిబిరంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సాధకులు


చింతపల్లిరూరల్: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు, ప్రశాంతతకు ఆంధ్రా కశ్మీర్ లంబసింగి నిలయమని బెంగళూరు ఆశ్రమానికి చెందిన యోగా గురువు జగదీష్ శాస్త్రి, కర్మయోగ కోఆర్డినేటర్ అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలో బౌడ శివాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల ధ్యాన సాధన శిబిరం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గుంటూరు, శ్రీకాకుళం, జంగారెడ్డిగూడెం, విశాఖపట్నం, తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన 27 మంది సాధకులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆధ్యాత్మిక ధ్యాన శిబిరం ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులకు బౌడ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



వనబరి గ్రామ సమీపంలోని తారురోడ్డు



గుల్లెలు- ఇంజరి తారురోడ్డు



ఇంజరి రోడ్డులో పెద్ద గెడ్డపై నిర్మించిన కాజ్‌వే

నాడు బూటు చప్పళ్లు.. నేడు ప్రగతి పరవళ్లు

- మారిన మావోయిస్టు ప్రభావిత ప్రాంతం ఇంజరి పంచాయతీ రూపురేఖలు
- రూ.26.3 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మాణం
- సుమారు 70 గ్రామాలకు ఉపయోగకరం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గిరిజనులు

ఇంజరి పంచాయతీ.. ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం..అభివృద్ధికి దూరం.. మావోయిస్టులు, పోలీసులు బూటు చప్పుళ్లతో నిత్యం భయంభయం.. అటువంటి ప్రాంతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో ఇప్పుడు ప్రగతికి కేరాఫ్‌గా మారిపోయింది. ఈ పంచాయతీలో గ్రామాలకు నిర్మించిన రింగ్‌రోడ్డు ఏజెన్సీకి తలమానికంగా నిలిచింది.

సాక్షి,పాడేరు: ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డాగా ఉన్న పెదబయలు మండలం ఇంజరి పంచాయతీలో ప్రగతి పూలు వికసిస్తున్నాయి. రహదారి సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి కాలినడకన మద్దిగరువు సంతకు చేరుకుని నిత్యావసరాలు కొనుగోలు చేసుకునేవారు. అత్యవసర పరిస్థితుల్లో గుర్రాలు, డోలీలపై ఆధారపడేవారు. ఇలా కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మౌలిక వసతులపై దృష్టి సారించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించింది. రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.26.3 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో జి.మాడుగుల మండలం మద్దిగరువు నుంచి చీకుపనస, జక్కం, వనబరి, కొండ్రుం మీదుగా, పెదబయలు మండలంలోని గుల్లెలు మీదుగా ఇంజరి పంచాయతీకి 30.9 కిలోమీటర్ల పొడవునా 70 మారుమూల గ్రామాలకు సౌకర్యవంతంగా రింగ్‌రోడ్డును నిర్మించింది. కొండగెడ్డలపై అవసరమైన చోట బ్రిడ్జిలు నిర్మించడంతో వరదలు వచ్చినా గిరిజనుల ప్రయాణం సాఫీగా సాగుతోంది.మెలికలు తిరిగిన ఈ రోడ్డు ఈ ప్రాంత సందర్శనకు వచ్చే వారిని ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసి గిరిజన పక్షపాతిగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని ఇంజరి పంచాయతీ గిరిజనులు ఆనందంతో తెలిపారు.



ఇంజరి పంచాయతీలో ఆకట్టుకుంటున్న మద్దిగరువు-కొండ్రుం ఘాట్ రోడ్డు

జీతాలకోసం 'ఉక్కు' ఉద్యోగుల ఎదురుచూపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో నెలాఖరుకు జీతాలు చెల్లించేవారు. గత కొన్ని నెలలుగా జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో అని ఉద్యోగులు ఎదురు చూడాల్సి వస్తోంది. గత నెలలో 21, 24 తేదీల్లో రెండు భాగాలుగా జీతాలు చెల్లించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సీఎండీను కలిసి జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం మార్కెటింగ్ బాగున్నా జీతాల చెల్లింపుపై జాప్యం జరగడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో పిల్లల జీతాల చెల్లింపు వంటి భారం ఉన్నందున జీతాల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

దైవ నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం

డాబాగార్డెన్స్ (విశాఖ): నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తెలిపారు. నగరంలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం నామ సంకీర్తన, భక్తి గీతాలాపన, ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. ముందుగా మందిరంలో వేంచేసిన కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కె. నాగేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, కోల్‌కతా ప్రసాద్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిపై నివశిస్తున్న జీవునికి నామ సంకీర్తన తోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. భగవన్నామ సంకీర్తనలు చేస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, భక్తులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- టాటా ఏస్ ఢీకొట్టడంతో ఆటో బోల్తా
- ముద్దుర్తికి చెందిన ఆరుగురికి గాయాలు
- మరొకరి పరిస్థితి విషమం



ఎడమ కాలు విరిగి పోవడంతో చికిత్స పొందుతున్న సత్యవతి

మాడుగుల: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా టాటా ఏస్ వాహనం ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. మరొకరి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మండలంలోని ఎం. కోటపాడులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదరనాయుడు వివరాల ప్రకారం... చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన ఏడుగురు ఆటోలో మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి వచ్చారు. అక్కడ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని సాయంత్రం వరకు ఆలయ సమీపంలో సరదాగా గడిపారు. తిరిగి స్వగ్రామం బయలు దేరారు. మార్గమధ్యంలో ఎం. కోటపాడు కొత్తమ్మతల్లి ఆలయం వద్ద పాడేరు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కాళ్లుచేతులకు గాయాలయ్యాయి. ఒకరి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. వీరిని స్థానికులు 108 వాహనంలో మాడుగుల 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యాధికారి రామకుమార్ ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. గాయాలైన వారిలో గొర్లి శ్రీనివాసరావు,(46) గొర్లి సత్యవతి, (42) శిరిసోళ్ల భాగ్యశ్రీ, (13) శిరిసోళ్ల మోక్ష(21), తాళ్లపురెడ్డి వెంకటలక్ష్మి, జి.రవి ఉన్నారు. తలకు గాయమైన తాళ్లపురెడ్డి సాయిరామ్(21) పరిస్థితి విషమంగా ఉందని వైద్యాధికారి తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మాడుగుల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సాయిరామ్

నవ్వులు పంచిన వినోదాల విందు

విశాఖ: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అతిథులు దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, సూర్య, పూర్ణచంద్రరావు కళాకారులను సత్కరించి అభినందించారు.



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం (విశాఖ): వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పవిత్ర నృత్యాలయంలో శిక్షణ పొందిన చిన్నారి కళాకారులు తమ నృత్య విన్యాసాలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. భవ్యశ్రీ,, చైత్రి, సహస్ర, శాంభవి, త్రిషిక యశస్వి, భవిష్య, హవ్యసాయి, హంసిని, పూజిత, కీర్తన తదితర కళాకారులు నృత్యం చేయగా ఎం.పవిత్ర నృత్య దర్శకత్వం వహించారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

నేటి కౌన్సెలింగ్ 6వ తేదీకి వాయిదా

మురళీనగర్ (విశాఖ): జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా గైస్‌లో 92,500-1,00,000, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1,00,001-1,08,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 92,001-1,08,000 ర్యాంకుల విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఈ మూడు కేంద్రాల్లో 363 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలించారు. గైస్‌లో 136మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 180 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 47మంది సర్టిఫికెట్లు పరిశీలకు హాజరయ్యారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సిలింగు ప్రక్రియను పర్యవేక్షించారు.

సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ నిర్వహించనున్న కారణంగా సోమవారం నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఈ నేపథ్యంలో షెడ్యూలులో స్వల్ప మార్పులు చేసిన విషయం విదితమే. దీని ప్రకారం సోమవారం నిర్వహించాల్సిన కౌన్సిలింగ్ 6వ తేదీన నిర్వహిస్తారు. వెబ్ ఆప్షన్లు 7నుంచి 10తేదీ వరకు పెట్టుకోవాలి. 11న ఆప్షన్ల మార్పిడి, 13న సీట్ల కేటాయింపు,14నుంచి 19వరకు సెల్ఫ్ జాయినింగు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

సండే సందడి...



తీరంలో సందడిగా సందర్శకులు

బీచ్‌రోడ్డు (విశాఖ): ఆదివారం పైగా చాలా రోజుల తరువాత వాతావరణం చల్లగా ఉండటంతో నగరవాసులు పర్యాటక ప్రాంతాల్లో సందడి చేశారు. వేసవి సెలవులు కావడంతో బీచ్‌లు, పార్కుల్లో పిల్లలతోసహా తల్లిదండ్రులు ఆనందంగా గడిపారు. ముఖ్యంగా సాగరతీరంలో పిల్లలు, యువతీ యువకులు స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.

ఉల్లాసంగా ఆవకాయ మిక్సింగ్





మామిడి ముక్కలను మిక్సింగ్ చేస్తున్న సందర్శకులు

బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఆంధ్ర ఆవకాయ పేరుతో ఆదివారం ఓ కార్యక్రమం చేపట్టారు. మామిడి కాయ ముక్కలు, కారం, నూనె, ఇతర పదార్థాలను మిక్సింగ్ చేసి నోరూరించే ఆవకాయను సిద్ధం చేశారు. ఈ మిక్సింగ్ మొత్తాన్ని జాడీల్లో నింపి నిల్వ చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆ ఆవకాయను నోవాటెల్‌కు వచ్చే అతిథులకు రుచి చూపించనున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– బీచ్‌రోడ్డు (విశాఖ)

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నండూరి రామకృష్ణ

క్లుప్తంగా

డ్రైనేజీని బాగు చేయాలి



శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీ వ్యవస్థ

అనకాపల్లి : మండలంలో అక్కిరెడ్డిపాలెం పంచాయతీ తారక రామారావు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ రహదారులపై పారుతున్నప్పటికీ పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం రాకముందు డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచినట్టయితే వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశం ఉండదని, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



మునగపాక : మండల కేంద్రమైన మునగపాకలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఆవ కాలువ సంఘ రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పండగ సందర్భంగా డప్పు వాయిద్యాల నడుమ రైతులంతా ఊరేగింపుగా గ్రామం నుంచి బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో తలుపులమ్మతల్లి పండగ



తంగేడులో తలుపులమ్మ తల్లికి మొక్కుతున్న గ్రామస్తులు

కోటవురట్ల : తంగేడు గ్రామంలో శ్రీ తలుపులమ్మతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్. రామచంద్రరాజు, పార్టీ నాయకులు ఆర్.ఎస్. లక్ష్మీనరసింహరాజు, సర్పంచ్ కొరుప్రోలు శివకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	: రాజా
గం గం గణేశా	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్ మీ	: షిర్డిసాయి
హిట్ లిస్ట్	: పర్తిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
బాక్	: శ్రీసత్య
భజే వాయు వేగం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 269 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 225 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఆపన్నులకు అండగా 'ఆసరా'



జగనన్న పథకాలే ఆదుకున్నాయి...

నా పేరు కోట నూకరత్నం, మాది మండలంలోని రేబాక గ్రామం. నా కుమారుడు కోట సత్యనారాయణ వికలాంగుడు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత మా జీవితాలు బాగున్నాయి. గతంలో నా కుమారుడు పట్టణంలో పనికి వెళ్లి రాకపోకలు చేసేందుకు చాలా ఇబ్బందులు పడేవాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మాకు సంక్షేమ పథకాలు ద్వారా ఏడాదికి రూ.1 లక్ష వరకు అందుతున్నాయి. నాకు వైఎస్సార్ చేయూత రూ.18,500, రైతు భరోసా 13,500, పింఛను నెలకు రూ.3000 వస్తుంది. నా కుమారుడికి ఫించను రూ.3వేలు, నా కోడలికి అమ్మ ఒడి రూ.13వేలు రావడంతో మా గ్రామంలోనే కిరాణా, పాన్‌షాప్ పెట్టుకున్నాం. దీంతో పాటు వైఎస్సార్ చేదోడు కూడా వస్తుంది. ఈ షాపును నిర్వహించుకుంటూ కుటుంబమంతా జీవిస్తున్నాం. నా వయస్సు 57 ఏళ్లు. గతంలో ఎప్పుడూ చూడలేని పాలన ఈ ఐదేళ్లలో చూస్తున్నాను. అన్ని సేవలు పొందుతున్నాం. మాకు అందే పథకాలు పోకుండా ఉండాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నాను.

- నియోజకవర్గంలో 47 వేల మందికి లబ్ధి
- మరిన్ని సంక్షేమ పథకాలతో ఇంటింటికీ బాసట

తుమ్మపాల : నియోజకవర్గంలో అనకాపల్లి, కశింకోట మండలాలతో పాటు జీవీఎంసీ పట్టణంలో పరిధిలో 4,650 డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్న సుమారు 47వేల మంది వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.147 కోట్లు లబ్ధి పొంది ఉన్నారు. అనకాపల్లి మండలంలో 1,850 గ్రూపులకు చెందిన 19వేల ఐదు వందల మంది మహిళలు రూ.56 కోట్లు, కశింకోట మండలంలో 1,536 గ్రూపులకు చెందిన 15వేల ఎనిమిది వందల మంది రూ.53 కోట్లు, జీవీఎంసీ పట్టణంతో పాటు విలీన గ్రామాలైన కొప్పాక, కొత్తూరు, సీరసపల్లి, రాజపాలెం, వల్లూరు గ్రామాలలో 1,196 గ్రూపులకు చెందిన 11వేల మంది రూ. 38 కోట్లు నాలుగు విడతలుగా లబ్ధి పొంది ఉన్నారు.

ఇంత సంక్షేమం ఎన్నడూ లేదు..

ఇచ్చిన హామీని నెలబెట్టుకుంటూ ప్రతి ఏటా కొంత మొత్తంలో నగదు చెల్లిస్తూ మహిళలను ఆదుకున్న జగనన్నకు మహిళలు హారతులు పడుతున్నారు. అనేక ప్రభుత్వాలు మారాయి. కానీ ఇలా సంక్షేమాన్ని అందించిన సీఎంను చూడలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చి చరిత్రలో నిలిచిపోయారు. డ్వాక్రా సంఘాల్లో ప్రతి మహిళకు కనీసం రూ. 2వేలు నుంచి అత్యధికంగా రూ.20 వేల వరకు ప్రతి ఏటా రుణ విడతలను చెల్లించారు. ఒక్కో మహిళ కనీసం రూ.50 వేలు రుణ మొత్తాన్ని పొందారు.

- దాసరి గోపాలరావు

నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా విడతల వారీ నగదు పంపిణీ (రూ.కోట్లలో)

మండలం	మొదటి విడత	రెండో విడత	మూడో విడత	నాల్గవ విడత
అనకాపల్లి	13.92	13.99	13.99	13.92
కశింకోట	13.27	13.31	13.31	13.27
అనకాపల్లి టౌన్	8.9	99.12	10.02	10.35
మొత్తం -	36.17	36.49	37.32	37.55



-డ్వాక్రా గ్రూపు మహిళలు

వేసవి శిక్షణ శిబిరంలో కోలాటం



దిమిలి గ్రంథాలయంలో కోలాటం ఆడుతున్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రీసోర్స్ పర్సన్స్ కోలాటంపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు కోలాటంతో నృత్యం చేశారు. అనంతరం పలు నీతి కథలు చెప్పారు. ఆయా కథల్లో నీతిని పాటించాలని రీసోర్స్ పర్సన్స్ అప్పారావు, నూకినాయుడు, లైబ్రేరియన్ శకుంతల సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాక : మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సాయిబాబా ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేతృత్వంలో నిర్వహించిన శిబిరంలో 115 మంది రోగులు హాజరుకాగా వారిలో 21 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కాగా శిబిరానికి విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు జాక్స్ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాక్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ క్యాంపు డిప్యూటీ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, తిమ్మరాజుపేట సత్యసాయిబాబా ఆలయ కన్వీనర్ అప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంజయ్యకాలనీలో శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అనకాపల్లి : స్థానిక గాంధీనగరం అంజయ్యకాలనీలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం గాంధీనగరం వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు రేజేటి చక్రవర్తి నిర్వహించారు. లోక కల్యాణార్థం కల్యాణాన్ని నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. కల్యాణాన్ని పురస్కరించుకుని శివపార్వతుల జీవితచరిత్ర గురించి భక్తులకు ఆయన వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్యకాలనీ, గాంధీనగరం ప్రజలు పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న రేజేటి చక్రవర్తి

ఘనంగా నల్లమారమ్మ తల్లి పండగ



భక్తులకు దర్శనమిచ్చిన నల్లమారమ్మ తల్లి

రాంబిల్లి : మండలంలో రజాల గ్రామంలో ఆదివారం నల్లమారమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పసుపు, కుంకుమలు సమర్పించుకొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డులు సిద్ధం చేసే పనిలో అధికారులు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో చివరి అంకమయిన లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కీలకమైన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు సిద్ధం చేస్తోంది. ఈ నెల 4వ తేదీన పాయకరావు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు జరగనుంది. ప్రధానపార్టీలతో పాటు ఇండిపెండెంట్ల నుంచి 9 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 21 రౌండ్ల ద్వారా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు తమ తరపున ఏజెంట్లను ఏర్పాటు చేస్తారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 105 మంది కౌంటింగ్ ఏజెంట్లను, ఐదుగురు జనరల్ ఏజెంట్లతో పాటు లెక్కింపు ప్రక్రియల్లో పాల్గొంటున్నారు. వీరందరి నుంచి ముందుగానే వివరాలు సేకరించారు. పోటీలో ఉన్న అభ్యర్థి ధ్రువీకరణతో వీరందరిని కౌంటింగ్ ఏజెంట్లుగా గుర్తించినట్టు ఆర్‌వో గీతాంజలి తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డులు వీరందరికి జారీ చేస్తారు. ఆర్‌వో ధ్రువీకరించిన ఈ గుర్తింపు కార్డులు తీసుకుని 4వ తేదీ ఉదయం 6 గంటల లోపు వీరంతా కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఎన్నికల అధికారులు తెలిపారు. కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. గుర్తింపు కార్డులు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం వీరందరికీ కార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని మంగశవరపుపేటలో మాడుగుల్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా చదవడం అంటే మాకు ఇష్టం ముగింపు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిష్ణాతులైన వారు అందించిన సూచనలు పాటించాలన్నారు. చదువులో ఏకాగ్రత అలాగే విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. మంచి ఫలితాలు రావాలంటే ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. శిక్షణలో సేవలందించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శిష్టా తమ్మిరాజు, మొల్లేటి సత్యనారాయణ, కేవీ రమణలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు బీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, ఆడారి అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రామసన్యాసి అప్పారావు, కొయిలాడ నరసింగరావు , లక్ష్మి పాల్గొన్నారు.

100 మందికి వైద్య సేవలు



వైద్య బృందంతో జగన్నాథరావు, అరుణలత

రాంబిల్లి : కొత్తపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహాత్మ గాంధీ కేన్సర్ ఆస్పత్రి, శేయ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 100 మందికి వైద్యులు సేవలందించారు. తమ గ్రామంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో గ్రామస్థులకు మేలు జరిగిందని సర్పంచ్ అరుణలత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం సంయుక్త కార్యదర్శి జగన్నాథరావు అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీనివాసుని కల్యాణం



నాగులాపల్లిలో కలియుగదైవం శ్రీనివాసుని కల్యాణంలో భక్తులు



శ్రీనివాసుడిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. పాటిమీద స్వయంభువుగా వెలసిన ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిగింది. ఆలయ చైర్మన్ దాడి ప్రకాష్, విల్లూరి పరమేశ్వరరావు, శిల్పి దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం అలాగే సంకీర్తనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీవారి పల్లకి కమిటీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పద్య పఠనంతో ధారణశక్తి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయుడు ఆచార్యులు

పాయకరావుపేట : పట్టణంలో గల గ్రంథాలయంలో చిన్నారుల పద్య పఠనం అలరించింది. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పద్య పఠనంపై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు విద్యార్థులకు పద్య పఠనం పై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు మాట్లాడుతూ ధారణాశక్తి పద్య పఠనం దోహదపడుతుందన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నప్పటికీ మన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి మన తెలుగు పద్యాలన్నారు. వాటిని అందరూ చదివి వాటిలో ఉండే నీతిని గ్రహించి, దైనందిన జీవితంలో అన్వయం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పద్య పఠనానికి హాజరయ్యారు.

చెరువులు...తవ్వేస్తున్నారు..

- అక్రమంగా మట్టి తరలింపు, అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



కుమారపురం వద్ద నున్న చెరువులో మట్టిని తవ్విన దృశ్యం



ఆవ నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టరు



చిన్న చెరువులో అక్రమంగా మట్టిని తవ్విన దృశ్యం

పాయకరావుపేట : మండలంలో గల నీటి పారుదల శాఖకు సంబంధించిన చెరువుల్లో మట్టిని కొందరు అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఇష్టారాజ్యంగా రాత్రి పగలు కూడా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మండలంలో గల గోపాలపట్నం వద్ద నున్న ఆవ, కుమారపురం వద్ద నున్న చెరువు, శ్రీరాంపురం సమీపాన గల చిన్న చెరువు, వెంకటపతిరాజు చెరువు తదితర చెరువుల్లో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా, ఏవిధమైన అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు వేలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. తరలిస్తున్న మట్టిని లేఅవుట్‌లకు, ఇటుక తయారు చేసే బట్టీలకు, ప్రైవేట్ కట్టడాల పునాదులకు అమ్మకాలు సాగిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని వెయ్యి రూపాయిలకు అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రతి చెరువులోను అధిక సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నప్పటికీ నీటి పారుదల శాఖ అధికారులు గాని, సంబంధిత అధికారులు గాని పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షణ లోపం, సంబంధిత సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలించుకుపోవడం విచ్చలవిడిగా సాగుతున్నది. సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేశాం...

ఈ విషయమై నీటి పారుదల శాఖ మండల అధికారి శ్రీరామమూర్తిని సంప్రదించగా చెరువుల్లో మట్టిని తరలిస్తున్నట్టు తనకు తెలిసిందని, మండలంలో పలు చెరువులు పరిశీలించగా తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు. రాత్రి సమయంలో మట్టి తవ్వకాలు చేపడుతున్నందున చర్యలు తీసుకోవడానికి వీలు పడడం లేదన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌కు కూడా తాము ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మట్టి తవ్వకాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వర్షపునీటితో అవస్థలు

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం తెల్లవారు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. మండలంలోని నారాయుడుపాలెంలో పలు చోట్ల రోడ్డుపై నీరు నిలిచిపోయింది. రోడ్డంతా గోతులమయంగా ఉండడంతో నీరు పోయే పరిస్థితులు కనిపించలేదు. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడ్డారు.